తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
09-05-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 261 | పేజీలు : 8 | వెల : 4
jayabherinews

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
JB జయభేరి



- తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ ద్వారా ప్రజలను దోచుకుంటున్నారు
- కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాజకీయంతో. ఓబీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది
- ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ముందు రాణి కాంగ్రెస్ ముస్లింలకు ఆ రిజర్వేషన్లు కట్టబెట్టేందుకు ముందుకు వస్తుంది
- ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేయాడానికి కాంగ్రెస్ పార్టీ ఎందుకు అడ్డు పడిందో చాలా కాలం తనకు అర్థం కాలేదు
- తెలంగాణ వీరులు, మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందా?
- ప్రపంచంలో చాలా దేశాల్లో అశాంతి, అస్థిరత్వం ఉంది
- దేశం ఇతరుల చేతిలోకి వెళ్ల కూడ దంటే అబ్ కీ బార్ మోదీ సర్కార్
- వరంగల్‌లో బహిరంగ సభలో ప్రధాని మోదీ

# ప్రజల పాలిట శాపం ఆర్‌ఆర్ ట్యాక్స్

**జయభేరి, వరంగల్, మే 8**

ప్రపంచంలో చాలా దేశాల్లో అశాంతి, అస్థిరత్వం ఉందని మోదీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశం ఇతరుల చేతిలోకి వెళ్ల కూడదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అందుకే దేశం అబ్ కీ బార్ మోదీ సర్కార్ అంటుందన్నారు. గతంలో దేశంలో వరుస బాంబు పేలుళ్ల జరిగేవన్నారు. కానీ ఇప్పటి వరకు మూడు దశల్లో పోలింగ్ జరిగిందని.. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో వేల కోట్ల కుంభకోణాలు జరిగాయన్నారు. ఆ పార్టీ ఎక్కడ ఉంటుందో.. అక్కడ కుంభోకణం ఉంటుందన్నారు. ఆ పార్టీ పదేళ్ల క్రితం చేసిన పాపాలను ప్రజలు మరిచిపోలేదని చెప్పారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదని బీఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. కానీ కర్ణాటకలో బీసీ రిజర్వేషన్లు కత్తిరించి.. వాటిని ముస్లింలకు ఇచ్చిందని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో ఏర్పాటు చేసి భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. వరంగల్ నగరానికి బీజేపీతో మంచి అనుబంధం

...మిగతాది 2 లో

# కాంగ్రెస్ మెడలు వంచాలంటే బీఆర్ఎస్ గెలవాలి



- కుత్బుల్లాపూర్ లో కేసీఆర్ బస్సు యాత్ర
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర కు అద్భుత స్పందన
- భారీగా తరలి వస్తున్న జన సందోహం
- రాగిడి లక్ష్మారెడ్డి కే జై కొడుతున్న ప్రజలు
- బీఆర్ఎస్ వైపే మల్కాజిగిరి ఓటర్లు
- బస్సు యాత్ర తోవలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఘన స్వాగతం పలికిన మహిళలు

...మిగతాది 2 లో

# సొంత ఇళ్లు కల నెరవేర్చే బాధ్యత బిజెపిది



- ఈటల రాజేందర్ కు సంపూర్ణ మద్దతు తెలిపిన దివ్యాంగులు
- ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల సంపూర్ణ మద్దతు
- కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక సీటు కూడా ఇవ్వలేదు
- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలను ఓటు బ్యాంకులుగా వాడుకుంది

**జయభేరి, మేడ్చల్ :**

ఈటల రాజేందర్ కి ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాలు, దివ్యాంగులు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. తుముకుంటలో ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక సీటు కూడా ఇవ్వలేదు. ఏబిసిడి

...మిగతాది 2 లో

# మోదీ పక్కా లోకల్

- మరి సోనియా ఎక్కడి నుండి వచ్చిందో కాంగ్రెస్ చెప్పాలి.. బండి సంజయ్



**జయభేరి, వేములవాడ:**

ప్రధాని నరేంద్ర మోడీ పాల్గోన్న వేములవాడ జనసభలో ఎంపి బండి సంజయ్ ప్రసంగానికి ప్రజలనుంచి మంచి స్పందన వచ్చింది. ప్రధాని సాక్షిగా కాంగ్రెస్ పై పంచ్ ల వర్షం కురిపించారు బండి సంజయ్. బండి సంజయ్ పంచ్ లకు ఈలలు, చప్పట్లతో వేములవాడ జనసభ మారుమోగింది. మోదీ పేరును ప్రస్తావించినప్పుడల్లా జనాలు ఈలలతో హర్షధ్వానాలు పలికారు. బండి సంజయ్ మాట్లాడుతూ కాశీ విశ్వేశ్వరుడి ప్రతిరూపమే నరేంద్రమోదీ. దేశ చరిత్రలో తొలిసారి దక్షిణకాశీకి విచ్చేసిన నాయకుడు మోదీ మాత్రమే. మోదీ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే కుట్రను కాంగ్రెస్ చేస్తోంది. మోదీకి ఆస్తిపాస్తులు... బ్యాంకు బ్యాలెన్స్ లేవు. ప్రధాని పదవి వద్దనుకుంటే జబ్బకు సంచి వేసుకుని పోయే మహనీయుడు మోదీ. నా మోదీని కించపరుస్తున్న కాంగ్రెస్ నేతలారా...ఖబడ్దార్. నా మోదీ మొండిమొలోడు కాదు... ఈ దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ను మెడలు పట్టి బయటకు

...మిగతాది 2 లో



# సౌత్ వాళ్లు.. ఆఫ్రికన్స్ లా ఉంటారు

**జయభేరి, న్యూఢిల్లీ, మే 8:**

లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ సీనియర్ నేత శాం పిట్రోడా చేసిన సంచలన వ్యాఖ్యలు మరో పెద్ద దుమారానికి దారి తీశాయి. ఇటీవల వారసత్వపు పన్నుపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల దుమారం సద్దుమణగక ముందే.. మరోసారి కాంట్రోవర్సీ కామెంట్స్‌తో ఇంటర్నెట్‌లో హాట్ డిబేట్‌కు తెరలేపారు శాం పిట్రోడా. ఆయన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శాం పిట్రోడా జాతి వివక్షకు పాల్పడుతున్నారని దుయ్యబట్టింది. అలాగే ప్రధాని మోదీ సైతం ఈ కాంగ్రెస్ సీనియర్ నేత కామెంట్స్‌పై ధ్వజమెత్తారు. రూపురేఖలు, రంగును ఆధారంగా చేసుకుని దేశ ప్రజలను అవమానిస్తున్నారని మండిపడ్డారు.'ది స్టేట్స్‌మన్'

...మిగతాది 2 లో

# మరో పదేళ్లు రేవంత్ సీఎం



**జయభేరి, హైదరాబాద్, మే 8:**

మరో పదేళ్ల పాటు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. తనకు పదవులపై ఆశ లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్యాంప్ పెట్టినప్పుడు మూడు రాత్రులు తాను కనీసం గది నుంచి కాలు బయట పెట్టలేదన్నారు. కొందరు డిల్లీ వెళ్లి పైరవీలు చేసుకున్నారన్నారు. కానీ తాను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అడిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జూన్ 5న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారన్నారు. త్వరలో

...మిగతాది 2 లో

# బాచుపల్లిలో విషాదం

## రేవంత్ ఆరా



**జయభేరి, హైదరాబాద్, మే 8:**

హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లిలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న గోడ కుప్పకూలింది. ఈ నిర్మాణం సమీపంలో ఉన్న ఏడుగురు ఈ శిథిలాల్లో చిక్కుకొని ప్రాణాలు వదిలేశారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో ఈ విషాదం జరిగింది. స్థానికంగా ఓ బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారు. అందులో పని చేసేవాళ్ల కోసం ఓ షెడ్ ఏర్పాటు చేశారు. అయితే రాత్రి కురిసిన వర్షానికి ఆ నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ సెంట్రింగ్ రాడ్స్ ఒరిగిపోయాయి. దీంతో అవి ఒక్కసారిగా పక్కనే కార్మికులు ఉంటున్న షెడ్‌పై పడ్డాయి. షెడ్‌లో ఉన్న వారిపై ఒక్కసారిగా స్లాబ్ సెంట్రింగ్ రాడ్లతో పడినందుకు వాళ్లెవరూ బయటకు రాలేకపోయారు. దీంతో పెను ప్రమాదం జరిగింది. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. జేసీబీల సాయంతో ఏడు మృతదేహాలను వెలికి తీశాయి. మృత్యువాత పడిన వారంతా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి ఏసీపి శ్రీనివాసరావు ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. రైజ్ డెవెలపర్స్ కన్స్ట్రక్షన్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఘటన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాచుపల్లి ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న

...మిగతాది 2 లో



# నిర్మల్ లో మంత్రి సీతక్క ప్రచారం

**జయభేరి, నిర్మల్:**

నిర్మల్ జిల్లాలో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లి ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలను సమస్యలను తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లాలోని రత్నాపూర్, వడ్యాల, రాజపూర్, అబ్బాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో కలిసి ప్రచారం నిర్వహించారు.




# క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు

**జయభేరి, రాచకొండ:**

రాచకొండ ఎస్వోటీ పోలీసులు ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ మూఠా గుట్టు రట్టు చేసి అరెస్ట్ చేసారు. ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న ఎల్బీ నగర్ కు చెందిన రమేష్ చంద్, పల్లపు పవన్ కుమార్, సురేష్ చౌదరి, వాసవి కాలనీ కి చెందిన ఈడుకుల్ల జగదీష్ లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 1,80,000/ నగదు నాలుగు మొబైల్ ఫోన్లు మరియు ఐసిఐసిఐ బ్యాంకు ఫెడరల్ బ్యాంకు , యాక్సిస్ బ్యాంక్ , సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలో 14 లక్షల 30 వేల 967 రూపాయల నగదును ఫ్రీజ్ చేసారు. బుకీలు MD.ఆసిమ్, సాయి ప్రసాద్, శివనా రాయణ పరారీలో ఉన్నారు. నిందితులు exchange.com, Slivery.com అనే వెబ్సైట్ నుండి ఢిల్లీ క్యాపిటల్స్ మరియు రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ 24ల మధ్య మ్యాచ్లను ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులు వెల్లడించారు.

మొదటిపేజీ తరువాయి

## ప్రజల పాలిట శాపం ఆర్ఆర్ ట్యాక్స్

ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం బీజేపీకి ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉండేవారన్నారు. అందులో ఒక ఎంపీ జంగారెడ్డి.. హన్మకొండ నుంచి గెలుపొందారని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అహ్మదాబాద్ తన కర్మ భూమి అని.. ఆ నగర దేవత భద్రకాళి అని చెప్పారు. అలాగే వరంగల్‌లో కూడా నగర దేవత భద్రకాళి అని మోదీ గుర్తు చేశారు. ఈ క్షేత్రం కాకతీయ సామ్రాజ్య వైభవానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు. భద్రకాళి చరణాలకు ఈ సందర్భంగా మోదీ నమస్కారాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే.. ఆ రాష్ట్రం.. ఆ పార్టీకి ఏటీఎంగా మారుతుందని పేర్కొన్నారు. అందుకు జార్ఖండ్‌లో దొరికిన నగదే అందుకు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయిందని విమర్శించారు. ఆ నగదు ఎక్కడకు వెళ్తుందని ఆయన ప్రశ్నించారు. ఇక తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ ద్వారా ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఆ డబుల్ ఆర్ ట్యాక్స్‌లో ఒక ఆర్ హైదరాబాద్‌కు వెళ్లితే.. మరో ఆర్ ట్యాక్స్ ఢిల్లీకి వెళ్తుందని ఆరోపించారు.ఇదే తరహా రిజర్వేషన్లు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని ఆ పార్టీ భావిస్తుందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీని గమనిస్తే.. ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ముందు రాదు కానీ.. ముస్లింలకు ఆ రిజర్వేషన్లు కట్టబెట్టేందుకు ముందుకు వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాజకీయంతో.. ఓబీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మాదిగలకు రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ అడ్డు పడుతుందన్నారు. అయితే మాదిగలకు తాను ఇచ్చిన హామీ మరిచిపోలేదన్నారు. ఇక బీఆర్ఎస్ సైతం బుజ్జగింపు రాజకీయాలే చేస్తుందన్నారు. 2014లో దళిత వ్యక్తి సీఎంగా చెస్తానని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారని చెప్పారు. కానీ ఆయన ఆ పని చేయలేదన్నారు.నాలుగో దశ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ సీట్ల కోసం.. భూతద్దంలో కాదు.. మైక్రోస్కోప్‌లో వెతుకోవాల్సి ఉంటుందన్నారు. సమ్మక్క, సారక్క గిరిజన యూనివర్శిటీకి కేంద్రం ఆమోదిస్తే.. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అటంకాలు పెడుతుందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ భయపడుతుందన్నారు. 2014లో తాము అధికారంలోకి రాగానే దళిత వ్యక్తి రామనాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేశామని.. అలాగే 2019లో అదివాసీలకు చెందిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేశామని తెలిపారు.కానీ ఈ రెండు నియామకాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిందని మోదీ గుర్తు చేశారు. ద్రౌపది ముర్మని రాష్ట్రపతి చేయాడానికి కాంగ్రెస్ పార్టీ ఎందుకు అడ్డు పడిందో చాలా కాలం తనకు అర్థం కాలేదన్నారు. కానీ ఆ తర్వాత అసలు విషయం అర్తమైందని చెప్పారు. ద్రౌపది ముర్మ గారి చర్మం రంగు నలుపు.. ఇక్కడ ఉన్న రాజకుమారిడికి అమెరికాలో ఓ ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ ఉన్నారని వివరించారు. ఆయన ఇటీవల ఓ మాట చెప్పారు.. చర్మం నల్లగా ఉన్నవారంతా ఆఫ్రికన్లు అని చెప్పారన్నారు.అంటే చర్మం రంగును బట్టి ద్రౌపది ముర్మగారిని ఆఫ్రికన్ అని కాంగ్రెస్ వాళ్లు భావించి ఉంటారన్నారు. అందుకే ఆమెను ఓడించాలని కాంగ్రెస్ పార్టీ భావించి ఉంటుందని విపులీకరించారు. దేశంలో చాలా మందికి నలుపు చర్మం ఉంటుదన్నారు. ఈ నలుపు ఎక్కడి నుంచి వచ్చిందనేది అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. భగవాన్ శ్రీకృష్ణుడు రంగు నీలం, నలుపు అని మోదీ గుర్తు చేశారు.సోనియా జన్మదినం రోజు.. రుణ మాఫీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందన్నారు. చివరకు ఆగస్ట్ 15వ తేదీకి రుణమాఫీని మార్చరన్నారు. సనాతన ధర్మాన్ని తిట్టే వారిని నమ్మగలమా అని మోదీ ఈ సందర్భంగా ప్రశ్నించారు. గతంలో పలు నగరాల్లో వరుస బాంబు పేలుళ్లు జరిగేవన్నారు. తెలంగాణ వీరులు, మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందా? అని ప్రశ్నించారు. హామీలు ఇచ్చి.. మరిచిన కాంగ్రెస్.. తెలంగాణకు మేలు చేస్తుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. మహిళలకు 2,500 ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ ఏమైందని ఈ సందర్భంగా మోదీ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ మెడలు వంచాలంటే బీఆర్ఎస్ గెలవాలి

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. బుధవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ కమాన్, ఔటర్ రింగు రోడ్డు లో మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డికి మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర. తెలంగాణ తొలి ముఖమంత్రి కేసీఆర్ దిగ్విజయంగా కొనసాగిస్తున్న బస్సు యాత్ర తమ పట్టణం చేరుకోవటం పట్ల ఆనందం తో ఆహ్వానం పలికారు మహా నేతకు మంగళ హారతులతో స్వాగతం పలికి విజయ తిలకం దిద్దిన మహిళలు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు అధినేతను చూడడానికి తరలివచ్చారు. వారందరికీ అభివాదం చేస్తూ నేతలను పలకరిస్తూ కేసీఆర్ బస్సు యాత్ర ముందుకు సాగింది. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షో లో పాల్గొని ప్రసంగించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... కాంగ్రెస్ మెడలు వంచాలంటే బీఆర్ఎస్ గెలవాలి.. 'నేను ఒక్కటే చెబుతున్నా.. ఇవాళ రైతుల గుండెల్లో, తెలంగాణ ప్రజల గుండెల్లో కనిపించేది కేసీఆర్. కేసీఆర్ గుండె చీలిస్తే కనిపించేది తెలంగాణ. నా ప్రాణం ఉన్నంత వరకు, భగవంతుడు నాకు శక్తి ఇచ్చినంత వరకు ఇక్కడ రైతులకు గానీ, ఎవరికైనా గానీ మోసం జరిగితే.. అన్యాయం జరిగితే నిద్రపోను. భూమి ఆకాశం ఒకటి చేసి పిడుగులుపడ్డంత పోరాటం చేస్తా.ఈ దొంగ హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించింది కాంగ్రెస్.

చల్లగా ముందుకుపోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన ఈ కాంగ్రెస్ మెడలు వంచి.. ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయించాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఖచ్చితంగా గెలవాలి. మీ అందరినీ కోరుతున్నా.. కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయం చేసుకుంటూ రాగిడి లక్ష్మా రెడ్డి గారిని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలి. ఈ రోజు చూపించిన ఉత్సాహాన్ని ఏడు నియోజకవర్గాల్లో మే 13వ తేదీ వరకు చూపించి.. కారు గుర్తుకు ఓటేసి రాగిడి లక్ష్మా రెడ్డి గారిని భారీ మెజారిటీతో గెలిపించాలి అని కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, పార్టీ మునిసిపల్/డివిజన్/వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, మహిళా నాయకురాళ్ళు, యువజన విభాగం నాయకులు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## మరో పదేళ్లు రేవంత్ సీఎం

బీఆర్ఎస్ దుకాణం ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. ఆరుగురు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు తనను సం ప్రదించారని తెలిపారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో 154 అసెంబ్లీ సీట్లు అవుతాయని... ఇందులో 125 కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మద్యం కేసులో ఇరుక్కొని తెలంగాణ పరువు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత బతుకమ్మ చుట్టూ తిరుగుతుందనుకున్నామని... కానీ బతుకమ్మలో బ్రాందీ బాటిల్ పెట్టుకొని తిరుగుతుందని గుర్తించలేకపోయామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటే శంకరమ్మకి తెలివి ఎక్కువ ఉందని, అయినప్పటికీ తలసాని మంత్రి ఎలా అవుతాడని ప్రశ్నించారు. కేసీఆర్‌ని ఫుట్ బాల్ ఆడుకుంటానన్న తలసాని... తర్వాత మంత్రి అయ్యి గొర్రెలు, బర్రెలు, చేపలు తిన్నాడని సెటైర్లువేశారు. రాముడి పేరు మీద బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. పదేండ్లు ప్రధాని ఉండి.. రాముడి పేరు చెప్పి ఓట్లు అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లపై మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఫైరయ్యారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మత కలహాలు రేపుతున్నారని మండిపడ్డారు. ఓట్ల కోసం బీజేపీ చిల్లర రాజకీయం చేస్తుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల ముచ్చట ఏమైందని ప్రశ్నించారు. ఏపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపైనా స్పందించారు. ఏపీలో జరిగే ఎన్నికల్లో తమ పార్టీకి ఒక్క సీటు రాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప నుంచి ఎంపీగా షర్మిల పోటీ చేస్తున్నారు.వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నా షర్మిల పీసీసీ చీఫ్ గా అయినా సరే.. ఒక్క సీటు కూడా రాదని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తేల్చేశారు. షర్మిలకు మనోధైర్యం ఇచ్చేలా కొన్ని మాటలు అయినా చెబితే బాగుండేదన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వినిపిస్తోంది.

# గులాబీ దళంలో అసంతృప్తులు

జయభేరి, హైదరాబాద్, మే 8:



పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మరికొద్ది రోజులు మాత్రమే ఉంది. తెలంగాణలో అన్ని పార్టీలలో విజయ గర్వం తొణికిసలాడుతోంది. అయితే, ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో బీఆర్ఎస్‌లో ఆ జోష్ తగ్గిందనే చెప్పాలి. గత అసెంబ్లీ ఎన్నికలలో అక్కరకు వచ్చిన కుల సంఘాల లీడర్లు, బస్తీ లీడర్లు బీఆర్ఎస్‌ను పట్టించుకోవడం లేదు. క్యాడర్ కూడా నిరుత్సాహంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో తమ పార్టీకి 10 నుంచి 12 స్థానాలు వస్తాయని, కేంద్రంలో చక్రం తిప్పేది తామేనంటూ చెబుతున్నారు. పైకి మేకపోతు గాంభీర్యంగా ఉన్నా లోలోపల ఆ పార్టీ నేతలకు భయం పట్టుకుందని, జనాన్ని సమీకరించడం తలకు మించిన భారంగా మారిందనే టాక్ వినిపిస్తోంది.లోక్ సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలో ముమ్మర ప్రచారం చేస్తున్నారు నేతలు. అయినప్పటికీ క్యాడర్ నుంచి ఆశించిన మేరకు పోటీ చేసే అభ్యర్థికి సపోర్టు రావడం లేదని సమాచారం. భువనగిరి, నాగర్ కర్నూల్, జహీరాబాద్ ఇలా మరికొన్ని పార్లమెంట్ సెగ్మెంట్లలో క్యాడర్ కలిసి రావడం లేదని తెలుస్తోంది. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓడిన అభ్యర్థులకే ఆయా నియోజకవర్గాల్లో బాధ్యతలు అప్పగించడంతో క్యాడర్‌తో పాటు జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నాగర్ కర్నూల్ ఎంపీ సెగ్మెంట్ ప్రచారంలో భాగంగా మన్నెవారిపల్లె వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎన్నికలకు ముందు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందజేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పలు నియోజకవర్గాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం.పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసి బీఆర్ఎస్ దాదాపుగా 40 రోజులు దాటింది. అన్ని వర్గాలతోనూ భేటీ అవుతున్నారు. సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గెలుపుపై అభ్యర్థులు కొంత అనుమానమే వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్ పూర్తిస్థాయిలో కలిసి రావడం లేదని పార్టీ అభ్యర్థులే అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అధిష్ఠానం కిందిస్థాయి నేతలను గుర్తించకపోవడం, పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడం, కమిటీలు సైతం ఏర్పాటు చేయకపోవడం, గ్రూపులపై ఫోకస్ పెట్టలేదన్న విమర్శలున్నాయి. దాని వల్ల క్యాడర్, సెకండ్ స్థాయి నేతలూ అసంతృప్తితో ఉన్నారు. అయినప్పటికీ ఎంపీ అభ్యర్థులు మాజీ ప్రజాప్రతినిధులపై ఆధారపడ్డారు. వారిపై ఇప్పటికే వ్యతిరేకత ఉండటంతో క్యాడర్ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని సమాచారం. దీంతో ఎంపీ అభ్యర్థుల గెలుపుపై వారి ప్రభావం తీవ్రంగా చూపే అవకాశం ఉందని రాజకీయ విమర్శకులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ పరిధిలో అన్ని పార్లమెంట్ సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు ఒకప్పుడు బలమైన నేతలు ఉండేవారు. పార్టీ అధినేత ఆదేశిస్తే చాలు దూసుకుపోయే క్యాడర్ కూడా ఉంది. కేసీఆర్‌ను ఈ క్యాడరే రెండు సార్లు అధికారంలో కూర్చోబెట్టారు. ఇప్పుడు వారే లోక్‌సభ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నా నియోజకవర్గ స్థాయి నేతలు, బల్దియా కార్పొరేటర్లు, క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు ముందుకు కదలడం లేదట. కొంతమంది ఎమ్మెల్యేలు తూతూమంత్రంగా పని చేస్తున్నారని టాక్. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ అనుకున్న లక్ష్యం నెరవేరడం కష్టమేనని అంటున్నారు విశ్లేషకులు.

# కోవర్టు క్రెడిట్ నాదే

సంచలన కామెంట్స్ తో మల్లారెడ్డి

జయభేరి, హైదరాబాద్, మే 8:



మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. నిజాన్ని నిర్భయంగా చెప్పడం ఆయన నైజం. మిగతావాళ్లు ఏమనుకున్నా ఆయన పెద్దగా పట్టించుకోరు. మాట్లాడిన ప్రతీ పదం వెనుక ఆయన నవ్వడం చాలా మందికి అనుమానాలుంటాయి. నిజంగా అంటున్నారా? లేక కావాలనే అంటున్నారా? లేకపోతే జోష్ నింపాలని భావిస్తారా? ఇలా రకరకాల అనుమానాలు లేకపోలేదు. కాకపోతే సోషల్ మీడియాలో ట్రెండ్ అయితేనే ఆయన నోరు విప్పుతారు. మామూలుగా నిత్యం వార్తల్లోకి ఉండేందు కు పరితపిస్తారాయన. అసెంబ్లీ ఎన్నికల తర్వాత చాలామంది నేతలు కారు దిగిపోయారు. మారిన రాజకీయాలకు అనుగుణంగా వెళ్లకుంటే తమకు లైఫ్ ఉండదని భావించి జంప్ అయిపోతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కూడా కాంగ్రెస్, బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు జిల్లాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, కౌన్సెలర్ల వంతైంది. దాదాపుగా కారు పార్టీ వీకైందని షెడ్‌కి వెళ్లిందని ఆ పార్టీ నేతలే బలంగా చెబుతున్నారు. బీఆర్ఎస్‌లో ముఖ్యనేతల వ్యవహారశైలి వల్లే కారణమని దుమ్మెత్తిపోస్తున్నవాళ్లూ లేకపోలేదు. పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన ఎమ్మెల్యే మల్లారెడ్డి.. బీఆర్ఎస్ నుంచి చాలామంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి తానే పంపించానని ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసేసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్‌లో ఉంటూ కారు కోసం కష్టపడతారని మనసులోని మాటను బయటపెట్టారు. దీనికి సంబంధించి వీడియో వైరల్ అయ్యింది. విచిత్రం ఏంటంటే పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారాయన. మల్లన్న మాటలపై ఆ పార్టీలోని నేతలే రుసరుసలాడుతున్నారు. ఎన్నికల్లో పార్టీ ఓడిపోతే ఎవరైనా అందులో ఉంటారా? ఈ లాజిక్‌ను మాజీ మంత్రి ఎలా మరిచిపోయారని అంటున్నారు. ఏదో కార్యకర్తల్లో హుషారు కోసం అలాగని చెప్పి ఉంటారని చెబుతున్నారు.ఇంకా నయం.. రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్యేలను కూడా తానే పంపించానని మల్లారెడ్డి అనలేదని అంటున్నారు పలువురు నేతలు. మొత్తానికి మల్లారెడ్డి వ్యాఖ్యలు విన్నవాళ్లు మాత్రం ఖుషీగా నవ్వుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ఏదో సరదాగా అన్నమాటలు కూడా ఒక్కోసారి మెడకు చుట్టుకుంటాయని పెద్దాయనకు బాగా తెలుసు. కాకపోతే మాటలతో మాయం చేయడం వెన్నతోపెట్టిన విద్య.

## బాచుపల్లిలో విషాదం

గోడకూలి ఏడుగురు చనిపోవడంపై సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సిఎం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తప్పిదం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాచుపల్లి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.మంగళవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షానికి బాచుపల్లిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ గోడకూలి ఏకంగా ఏడుగురు కార్మికుల మృతి చెందారు. ఆరిజన్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన ప్రాజెక్టు సైట్ లో ప్రమాదం జరిగింది. రిటర్నింగ్ వాల్ నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డీసీపీ శ్రీనివాసరావు చెప్పారు. భవన యజమాని అరవింద్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.మృతులందరూ ఒడిశా రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. సెంట్రింగ్ పనుల కోసం వచ్చిన కార్మికులు.. కన్‌స్ట్రక్షన్ సైట్‌లోనే రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నారు.

## సొంత ఇళ్లు కల నెరవేర్చే బాధ్యత బిజెపిది

చేస్తానని ప్రామిస్ చేసింది నరేంద్ర మోడీ అయితే.. మోసం చేసింది మన్మోహన్ సింగ్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ. కాంగ్రెస్ మాదిగల పొట్ట కొడుతుంటే బిజెపి మన ఆకలి బాధను తీరుస్తుంది. ఈటల రాజేందర్ మీద పోటీకి కాంగ్రెస్ పార్టీ ఒక రెడ్డిని, టిఆర్ఎస్ ఒక రెడ్డిని పెట్టింది.. ఎస్సీ ఎస్టీ బీసీలు అందరం ఏకమై రాజేందర్ అన్నని గెలిపించుకుందాం. 17 స్థానాల్లో ఇద్దరికి మాత్రమే బీసీలకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చింది. రెడ్డి వర్గానికి 7 టికెట్లు ఇచ్చింది. 50 శాతం ఉన్నవారికి రెండు టికెట్లు ఏడు శాతం ఉన్నవారికి 7 టికెట్లు ఇచ్చుకున్నారు. బీసీ ఎస్సీ ఎస్టీలకు మద్దతుగా ఉన్న పార్టీ ఒక్క బీజేపీ మాత్రమే. అందుకే మా మద్దతు బీజేపీకే.

ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అనేక సామాజిక ఉద్యమాలను భుజాన వేసుకున్న నాయకుడు మందకృష్ణ మాదిగ. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలను ఓటు బ్యాంకులుగా వాడుకుంది తప్ప ఏ రోజు కూడా ఆ జాతుల ప్రయోజనం కోసం పనిచేయలేదు. బీసీలకు టికెట్లు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి. 27 మంది ఓబీసీ, 12 మంది దళితులు, ఎనిమిది మంది గిరిజనలు, ఐదు మంది మైనారిటీ మంత్రులను ఇచ్చిన ఘనత మోడీది. 60 శాతానికి పైగా అనగారిన వర్గాలకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది.

దివ్యాంగులకు అద్భుతమైన సృజనాత్మకత, మేధస్సు, జ్ఞాపకశక్తి ఉంటుంది. ఎన్నికల కంటే ముందు రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి అవ్వగానే దివ్యాంగులకు 6000 పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చారు ఏ ఒక్కరికైనా వచ్చిందా? కొత్తగా ఒకరికి కూడా పెన్షన్ ఇవ్వడం లేదు. ఆరు గ్యారెంటీలు 66 రకాల హామీలు 420 పనులు చేస్తా అన్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు అక్కడి నుంచి లంకె బిందెలు తీసుకొస్తా అంటున్నారు ఎలా నమ్మేది? ఈ రాష్ట్రంలో నాకు పరిచయం లేని సంఘము లేదు. ఎవరు ఎక్కడ టెంట్ వేసిన నేను వెళ్లి మద్దతు తెలిపాను. వికలాంగులు, మరుగుజ్జులు, వీఆర్ఏలు, వీఆర్వోలు, మహిళాసంఘాలు, ఆశవర్కర్లు, ఆర్టీసీకార్మికులు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బంది బాధ ఉన్నదని గాయిపెడితే నేను ఉన్న అని చెప్పి సంఘీభావం చెప్పిన బిడ్డను. నేను సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో పెరిగిన బిడ్డను. మీ బాధలన్నీ తెలిసిన వాడిని. పోరగాల్లమే అయిన చిచ్చరపిడుగుల వలె కొట్లడినం. అప్పటినుంచి అది అదే పోరాటం.. అధికారంలో ఉన్నా కూడా కొనసాగింది. మంత్రి అయ్యాక.. గుర్తింపులేని కులాలకు సర్టిఫికెట్ ఇప్పించాను. 78 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించడానికి శ్రీకారం చుట్టింది నేనే. కరోనా పేషంట్ల దగ్గరకు వెళ్లి పలకరించి ధైర్యం ఇచ్చి కాపాడిన బిడ్డను. అవసరం వచ్చినప్పుడు ఆపద వచ్చినప్పుడు అండగా ఉన్నాను. ప్రధాని రెండు లక్షల ఇరవై మూడు వేల ఇల్లు ఇచ్చిన కేసీఆర్ వాటిని కట్టలేదు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ రావాలంటే మోడీ ప్రధానమంత్రిగా.. నన్ను మీ ఎంపీగా ఎన్నుకుంటే నేరుగా లబ్ధిదారులకు ఇల్లు ఇచ్చే బాధ్యత మాది. పదవి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమో, బ్రోకరిజం కోసము కాదు. పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఈ పదవి కోరుతున్నాము. ప్రజలకు సేవ చేసే పాత్ర పోషిస్తానని మీ అందరికీ హామీ ఇస్తూ.. పేదలకు సొంత ఇళ్లు కల నెరవేర్చే బాధ్యత బిజెపిది.

## మోదీ పక్కా లోకల్

గెంటేసిన జగమొండి. 370 ఆర్టికల్ ను రద్దు చేసి ఏక్ దేశ్ మే దో విధాన్... దో ప్రధాన్...దో నిషాన్ నహీ చలేగా అంటూ నినదించిన నా శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను అమలు చేసి వేలాది మంది బలిదానాలకు సార్థకత చేకూర్చిన జగమొండి నా మోదీ. ట్రిపుల్ తలాఖ్ ను రద్దు చేసి.. ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించిన జగమొండి మోదీ. హిందువుల 5 వందల ఏళ్ల నాటి కల అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట కార్యాన్ని స్వహస్తాలతో నెరవేర్చిన జగమొండి నా మోదీ . కరోనా వ్యాక్సిన్ అందించి 140 కోట్ల మంది ప్రజలకు ప్రాణాలను కాపాడిన జగమొండి నా మోదీ. మూతపడ్డ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని 6 వేల కోట్లకు పైగా వెచ్చించి తెరిపించిన జగమొండి నా నరేంద్రమోదీ. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేసిన జగమొండి నా మోదీ. నరేంద్ర మోదీ 'మేడ్ ఇన్ భారత్'... మరి సోనియా మైనో, రౌల్ విన్సీ ఎవరు? ...మేడ్ ఇన్ ఇటలీ. మా భారతీయ జనతా పార్టీ మేడ్ ఇన్ ఇండియా... మీ కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది మేడ్ ఇన్ బ్రిటీష్. నా మోదీ పక్కా లోకల్. మరి సోనియా ఎక్కడి నుండి వచ్చిందో కాంగ్రెస్ చెప్పాలే. పక్కా లోకల్ మోడీ కావాలా? నాన్ లోకల్ రాహుల్ విన్సీ, సోనియా మైనో కావాల్నా. మేడ్ ఇన్ భారత్ పార్టీ కావాల్నా?? మేడ్ ఇన్ బ్రిటన్ పార్టీ కావాలా. 6 గ్యారంటీలను అడిగితే కాంగ్రెస్ నేతలు గాడిద గుడ్డు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే పెద్ద గాడిద గుడ్డు. 6 గ్యారంటీల అమలును చేయమంటే ఇచ్చింది గాడిద గుడ్డు. 2లక్షల రైతు రుణమాఫీ చేయాలని అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. వరికి రూ.500ల బోనస్, తాలు, తరుగుతో పనిలేకుండా వడ్లు కొనమని అడిగితే మన చేతికి ఇచ్చింది గాడిద గుడ్డు. రైతులు, కౌలు రైతులకు 15వేలు, రైతు కూలీలకు 12 వేలు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. విద్యార్థులకు రూ.5లక్షల కార్డు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. వృద్ధులకు, నిరుద్యోగ భృతి రూ.4 వేల పెన్షన్ అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. మహిళలకు 2,500లు అడిగితే ఇచ్చింది గాడిద గుడ్డు. అసలు కాంగ్రెస్ మ్యానిఫెస్టోనే పెద్ద గాడిద గుడ్డు. ఆ పార్టీ గుర్తు హస్తం కాదు... గాడిద గుడ్డు మాత్రమే. అరడుగుల బుల్లెట్ మన నరేంద్ర మోడీ. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ చోర్ బ్యాచ్. అరడుగుల బుల్లెట్ మోదీ కావాలా?? లేక చోర్ బ్యాచ్ కాంగ్రెస్ కావాలా? మోదీ ఏ పని చేపట్టినా వాళ్ల అమ్మ ఆశీస్సులు తీసుకుని బయటకువస్తారు. ఇప్పుడు వారికి అమ్మ లేరు. మనమంతా మోదీ పక్షాన ఉంటూ ముచ్చటగా మూడోసారి ప్రధానిని చేసుకుందామని అన్నారు.

## సౌత్ వాళ్లు..ఆఫ్రికన్స్ లా ఉంటారు

పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన శాం పిట్రోడా.. భారతదేశం చాలా భిన్నమైన దేశమని పేర్కొన్నారు. అలాగే మన దేశం విభిన్న సంస్కృతులకు నిదర్శనం అని తెలిపారు. తూర్పు ప్రజలు చైనీయుల్లా.. పశ్చిమాన ఉన్న ప్రజలు అరబ్బులుగా కనిపిస్తారని, ఇక ఉత్తరాది ప్రజలు శ్వేతజాతీయులుగా.. దక్షిణాది ప్రజలు ఆఫ్రికన్‌లుగా కనిపిస్తారని చెప్పారు. ఇవన్నీ ఎలా ఉన్నప్పటికీ.. మనమందరం సోదరులు సోదరీమణులమని, ప్రతీ ఒక్కరి భాష, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు, సంస్కృతిని పరస్పరం గౌరవించుకుంటామని ఆయన అన్నారు.మరోవైపు శాం పిట్రోడా వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. భారతీయుల రూపురేఖల ఆధారంగా ఆయన పోల్చిన తీరు జాతి వివక్షేనని ధ్వజమెత్తింది. విభజించిపాలించు అనేది కాంగ్రెస్ సిద్ధాంతమని బీజేపీ నేతలు మండిపడ్డారు. అయితే తాజాగా ఈ విమర్శలపై కాంగ్రెస్ స్పందించింది. అవన్నీ కూడా శాం పిట్రోడా వ్యక్తిగత అభిప్రాయమంటూ వివరణ ఇచ్చింది.


# అహంకారంతో విర్రవీగుతున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

**జయభేరి, కొండమల్లెపల్లి :**



కొండమల్లేపల్లి పట్టణములోని సాయికృపా పంక్షన్ హాల్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ వచ్చాక అంతా రివర్స్ ఉన్నవి పోతున్నయి. కల్యాణ లక్ష్మి చెక్కులు బంద్ అయ్యాయి, కేసీఆర్ కిట్స్ బంద్ అయ్యాయిది అని ఆయన తెలిపారు. 24 గంటల కరెంటు బంద్ అయ్యింది. తాగు నీటి కొరత వచ్చింది అని అన్నారు. పింఛన్లు ఇవ్వడం లేదు.రైతు బంధు ఇవ్వడం లేదు,తులం బంగారం జాడ లేదు. చేతగాని ప్రభుత్వం. మోసం చేసింది అని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఏం చేసిందని కొందరు నాయకులు కాంగ్రెస్ లో చేరారు. రాహుల్ గాంధీ నిర్మల్ సభలో మహిళలకు నెలకు 2500వేస్తున్నమని చెప్పి అబద్ధం ఆడారు.రాష్ట్రప్రజలు కాంగ్రెస్ పార్టీ కి తగిన గుణపాఠం చెప్పాలి. పార్టీలు మారిన దొంగలకు బుద్ధి చెప్పాలి అని కోరారు. అందరి కోసం పని చేసిండు కేసీఆర్ అని తెలిపారు. కాంగ్రెస్ నుండి అపాయం ఉంది. తప్పించుకునే ఉపాయం మన చేతుల్లోనే ఉంది.మైనార్టీల సంక్షేమం కోసం దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది అని ఆయన అన్నారు.రంజాన్ తోఫా కూడా ఇవ్వలేని ప్రభుత్వం ఇది.కాంగ్రెస్ బిజెపి రెండు ఒకటే. వద్దురో కాంగ్రెస్ పాలన అని ప్రజలు మొత్తుకుంటున్నారు.రేవంత్ సర్కారు ఒక్క జాబ్ నోటిఫికేషన్ అయినా వచ్చిందా అసలైన మార్పంటే ఏంటో చూపాలి. కేసీఆర్‌కు అండగా నిలబడాలి. గ్యారంటీలు అమలు చేయడం చేతకాక తిట్లు, దేవుడిపై ఒట్లు వేస్తున్నారు అని అన్నారు..కాంగ్రెస్ ఓట్లు అడిగేముందు ఎన్నికల హామీల గురించి మాట్లాడాలి అని కోరారు.కేసీఆర్ ఎన్ని కష్టాలున్నా రైతుబంధు ఆపలేదు.

కేసీఆర్ విపక్ష నాయకుడిగా హామీల అమలుపై ప్రశ్నిస్తే నీ చెడ్డి ఊడదీస్తా, పేగులు మెడలో వేసుకుంటా అంటున్నడు కేసీఆర్. సీఎం మాట్లాడే మాటలేనా ఇవి ?అని అన్నారు.బీఆర్ఎస్ బేజేపీతో కుమ్మక్కయిందని అబద్ధాలు ప్రచారం చేశారు అని ఆయన తెలిపారు.అదే నిజమైతే కేసీఆర్ బిడ్డ ఎందుకు జైలుకెళ్తుంది.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు అని ఆయన అన్నారు.పదేళ్ల బీజేపీ పాలనతో ప్రజలు కష్టాలపాలయ్యారు అని తెలిపారు. కేంద్రంలో మనం చక్రం తిప్పాలన్నా, కాంగ్రెస్ మెడలు వంచాలన్నా కారు గుర్తుకు ఓటేయాలి అని ఆయన కోరారు.రేవంత్ సర్కారు వచ్చాక అన్ని పథకాలూ గోవిందా గోవింద. ఇక కాంగ్రెస్ కూడా గోవిందా అని ఆయన అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురుకుపెట్టాలి అని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్లమెంటు ఎన్నికల సమన్వయ కర్త మల్లికార్జున్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య, మండల అద్యక్షులు రమావత్ దస్రు నాయక్, TVN Reddy, కేసాని లింగా రెడ్డి, మారం రవీందర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు రమావత్ తులిసిరామ్ నాయక్, రమావత్ శ్రీను, సత్యం, వెంకటయ్య, పాండు, సైద్ది రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఇంట్లో మధ్యాహ్నం భోజనం

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేసిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు. అనంతరం మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని ఎన్నికల ప్రచార సరళిని తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు, అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎన్నికల ఇంఛార్జి ఎండీ జాంగిర్ పాషా, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మరియు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్ బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరీ అంజయ్య, గంధం జ్యోష్ణ నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఉద్యమకారులు మహిళ సోదరీమణులు, యువత కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యం నగర్ లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, కాప్రా :**

డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని సుబ్రమణ్యం నగర్ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. నిన్న రాత్రి కురిసిన వర్షానికి డ్రైనేజీ పొంగి ఇంట్లోకి రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. వెంటనే EEతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ ద్వారా ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి రాజీ రెడ్డి, రహీమ్, సాయి రెడ్డి, కాలనీ వాసులు నాగేందర్, శ్రీహరి గౌడ్, దాసు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలిపిన టిడిపి పార్టీ

**జయభేరి, దేవరకొండ :**

పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జి వస్కుల కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు,ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు , బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం లో టీడీపీ కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేసినట్లు తెలిపారు,గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి మద్దతిస్తూనట్లు ప్రకటించారు.గత అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే బాలు నాయక్ కి మద్దతు తెలిపి టీడీపీ కార్యకర్తలు శక్తి మేరకు కృషి చేసి వారి గెలుపు కోసం పని చేశామని అన్నారు, ఈ కార్యక్రమం లో నెరేడుగొమ్ము మండల అధ్యక్షుడు కోతి అమరేందర్ రెడ్డి, దేవరకొండ మండల అధ్యక్షుడు గార్లపాటి శ్రీనివాస్, చందంపేట మండల అధ్యక్షుడు చిలుకూరి బ్రహ్మాచారి, పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు సీత సీతారాములు యాదవ్, చింతపల్లి మండల ఉపఅధ్యక్షుడు సంతోష్, మాజీ సర్పంచి నర్సింహ, పెరికేటీ యాదగిరి, పెద్దయ్య, టీఎన్ఎస్ఎఫ్ నల్గొండ పార్లమెంట్ అధ్యక్షుడు వస్కుల రాజేష్, చింతపల్లి మండలం వెంకటంపేట జూలూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ గెలవడం ఖాయం

▸▸ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు...

**జయభేరి, మేడ్చల్:**

బోడుప్పల్ లోని తన నివాసంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల షామేలు మీడియాతో మాట్లాడా. దేశానికి మోడీ ఈ 10 సంవత్సరాలలో ఏమీ చేయలేదు.. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ 10 సంవత్సరాలలో ఎలాంటి అభివృద్ధి పరచలేదు. బిజెపి, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలతో రెండు ఒకటే. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఈటెల రాజేందర్ బీసీ జపం చేస్తూ అగ్రవర్ణాలతో ఉంటున్నారు. పేదల వ్యతిరేకంగా ఈటెల రాజేందర్ వ్యవహరిస్తున్నారు. బిజెపి కి ఇప్పుడు ఉన్న నాలుగు స్థానాలు పోతాయి. బీజేపీ సంపన్నులకు 6లక్షల 50 వేల కోట్ల రుణాలు మాఫీ చేసింది. రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా ప్రజలను మేల్కొలుపుతున్నారు. ఉపాధి హామీపథకాన్ని కాంగ్రెస్ తెచ్చింది. మల్కాజ్ గిరి పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ గెలవబోతుంది. భారీ మెజారిటీతో కాంగ్రెస్ ను గెలిపించాలని ప్రజలకు సామేలు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త కిషోర్ గౌడ్, నత్తి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాగిడి లక్ష్మారెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం

▸▸ మల్కాజిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కుమార్తె డాక్టర్ మౌనిక రెడ్డి

**జయభేరి, కూకట్ పల్లి :**



మల్కాజిరి పార్లమెంట్ కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షో, ఇంటింటి ప్రచారంలో భాగంగా మల్కాజిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కుమార్తె డాక్టర్ మౌనిక రెడ్డి తన తండ్రి గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. జాతీయ పార్టీల అహంకార భావంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అనదొక్కాలని ప్రయత్నిస్తున్న వారికి ఓటు అనే ఆయుధంతో కారు గుర్తుపై ఓటు వేసి తగిన గుణపాఠం చెప్పాలని తెలియజేశారు. కాంగ్రెస్ బిజెపి అభ్యర్థులకు ఓటు హక్కు కూడా మల్కాజిగిరిలో లేదు. ఆరు గ్యారెంటీలని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు ఉద్యమకారులు మహిళ సోదరీమణులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

▸▸ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాప్రా డివిజన్ సాయి బాబా నగర్ బూత్ నంబర్ 35, 36, 37లల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచారం లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 4 నెలలు గడుస్తున్నా రాష్ట్రానికి చేసింది ఏమి లేదు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, బంక వెంకటేష్, దామోదర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్లను దగ్నం

▸▸ దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.. జిల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్

**జయభేరి, పీఏ పల్లి :**



పీఏ పల్లి మండలం అజ్మాపురం గ్రామ శివారులో గౌడ కల్లు వృత్తి దారులు ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 300 లో దాదాపు రెండు తరాల నుంచి ఈ భూమిలో ఉన్నటువంటి ఈత చెట్లకు కల్లు గీసుకుని కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ఈ చెట్లు కల్లు గీత సొసైటీ అజ్మాపురం వారికి ఎక్సైజ్ శాఖ ఇచ్చినది. గ్రామస సొసైటీ సభ్యులు కల్లు అమ్ముకొని కుటుంబ పోషణ నడిపిస్తున్నారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు ఈత చెట్లల్లోకి జొరబడి నిప్పు అంటించి పూర్తిగా దగ్నం చేశారు అని తెలంగాణ గీత సంఘాల సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈత వనంలో గీత పనిముట్లు మొత్తం కాలీ బూడిదైనాయి. దీనివలన 10 సంవత్సరాల వరకు గీతా వత్తిదారులకు జీవనోపాధి లేక కుటుంబాలు బజారు పాలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇట్టి విషయాన్ని ఎస్సై గుడిపల్లి వారికి దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయగలరని పిటిషన్ ఇచ్చినాము. ఇట్టి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, ఎస్పి పరిశీలించి కల్లు వృత్తి దారులకు జీవనోపాధి కల్పించే విధంగా పునరావాసం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జిల్లా రాములు, సొసైటీ అధ్యక్షులు మారుపాకుల సురేష్ గౌడ్, మారుపాకుల లక్ష్మయ్య గౌడ్, మారుపాకుల సత్యనారాయణ గౌడ్, భీమగోని భీమయ్య గౌడ్, గిరి వెంకటయ్య గౌడ్, కుంభం అనిల్ గౌడ్, భీమగొని ఆంజనేయులు గౌడ్, మారుపాకుల రాజయ్య గౌడ్, గీత కార్మికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## సియం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

▸▸ భజరంగ్ దళ్, హిందూ వాహిని..



**జయభేరి, జవహర్ నగర్ :**

హిందుత్వాన్ని, అయోధ్య రాముడిని టార్గెట్ చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న సియం రేవంత్ రెడ్డితో పాటు అద్దంకి దయాకర్ లాంటి కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా హిందువుల నుండి నిరసన సెగలు భగ్గుమంటున్నాయి. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో భజరంగ్ దళ్, హిందూ వాహిని ఆధ్వర్యంలో సియం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. మైనారిటీ ఓట్లే లక్ష్యంగా మతతత్వ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ హిందుత్వాన్ని హేళన చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. హిందువుల జోలికొస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.




## రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయని బిజెపి

జయభేరి, ఇల్లందు :

రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయని బిజెపిని ఒంటరి చేద్దాం వ్యతిరేకిద్దాం శిక్షిద్దాం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మే 13 న జరుగు పార్లమెంట్ ఎన్నికల్లో రైతాంగం బిజెపిని ఎండగట్టేందుకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. కరుణ కాలంలో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా 13 నెలల పాటు సుదీర్ఘ పోరాటం జరిగింది 750 మంది రైతుల ప్రాణాలు బలిదానం చేశారు ఫలితంగా 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవడంతోపాటు కనీస మద్దతు ధర చట్టం చేస్తానని రుణమాఫీ చేస్తానని విద్యుత్ సవరణ బిల్లులను రైతులతో మాట్లాడకుండా పార్లమెంట్లో పెట్టమని రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తానని ఫజల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా మారుస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చింది ఈ రెండు సంవత్సరాల కాలంలో హామీలను అమలు చేయకపోగా వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకున్నది కావున వీటికి వ్యతిరేకంగా జరగబోయే ఎన్నికల్లో ఇండియా కూటమికి ఓటు వేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్రం తరపున ఏపూరి బ్రహ్మం పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో రాయల్ చంద్రశేఖర్ (సిపిఐ ఎంఎల్ ఏఐకేఎస్) నాయకులు గుమ్మడి నరసయ్య (ఎక్స్ ఎమ్మెల్యే) బుర్ర వెంకన్న (ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు) ఎస్కే నభి (ఏ ఐ కె ఎస్ జిల్లా నాయకులు) సైదులు కాంగ్రెస్ రైతు విభాగ నాయకుడు దేవరకొండ శంకర్ జిల్లా కార్యవర్గం సభ్యులు బుల్లి కొమరయ్య అంజయ్య గణపతి వల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొనడం జరిగింది

## అక్రమ నగదు,మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలి

- ఇల్లందు సబ్ డివిజన్ లోని అంతర్ జిల్లా చెక్ పోస్టులను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్
- పోలింగ్ పూర్తయ్యే వరకు చెక్పోస్టుల వద్ద పనిచేసే అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి




జయభేరి, ఇల్లందు :

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గం నందు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్పోస్టులను తనిఖీ చేశారు.బొమ్మనపల్లి క్రాస్ రోడ్డు వద్ద,ఇల్లందు లలితాపురం చెక్ పోస్ట్ లను తనిఖీ చేసి సింగరేణి ఎయిడెడ్ హై స్కూల్ నందు స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా చెక్పోస్టుల వద్ద పనిచేసే అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు.పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు మరియు మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా అధికారులు భాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.అనంతరం ఇల్లందు పోలీస్ స్టేషన్ కు చేరుకుని,పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు,రూట్ మ్యాప్ ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.జిల్లా ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,సీఐ కరుణాకర్,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు,ఎస్సై సందీప్ , సిబ్బంది పాల్గొన్నారు.




## బేగంపేట నాలా లో కొట్టుకు వచ్చిన రెండు మృత దేహాలు

జయభేరి, బేగంపేట్:

హైదరాబాద్ నగరంలో మంగళ వారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బేగంపేట లోని నాలాలోకి రెండు మృత దేహాలు కొట్టుకుని వచ్చాయి.అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా వున్నాయి.బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ నీ అనుకుని కూకట్ పల్లి నాలా.అమీర్ పేట నాలాలు ప్రవహిస్తుంటాయి.అయితే మంగళ వారం రాత్రి కురిసిన వర్షాలకు ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు నాలాలో కొట్టుకుని వచ్చాయి.వీరు ప్రమాద వశాత్తూ నాలాలో పడి చనిపోయారా లేక రోడ్లపైనే వుండే మ్యాన్ హోల్స్ నీ గుర్తించలేక అలా అక్కడ పడిపోయి నాలా లోకి చేరుకున్నారా అన్న విషయాలు తెలియరాలేదు .మృతి చెందిన వారి వయస్సు సుమారు 40నుంచి 45సంవత్సరాలు వుంటుందని ప్రత్యక్ష సాక్షుల సమాచారం.తెల్లారే సరికి నాలా లో రెండు మృతదేహాలు కొట్టుకుని రావడం తో ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వాసులు బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. బేగంపేట్ పోలీసులు, క్లూస్ టీం, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ టీం సహకారంతో మృతదేహాలను గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. గుర్తుతెలియని మృతదేహాల క్రింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి జీహెచ్ఎంసీ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి చేరుకొని డీఆర్ఎఫ్ టీం తో వివరాలు అడిగితెలుసుకున్నారు.

# అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యం

జయభేరి, మేడిపల్లి :




పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూతనపాటి బెంజుమన్ బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు జావీద్ ఖాన్ ఆధ్వర్యంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, నగర అధ్యక్షులు బండారి రవీందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ.. ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు 6 నెలలకే వారెంటి అయిపోయిందని, ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఇప్పుడు హామీలు అమలు చేయకుండా చేతులెత్తశారని ఏద్దేవా చేశారు. మైనార్టీలకు అన్ని రంగాలలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకే ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కౌడే పోచయ్య,బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, 14వ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే మా మద్దతు

- క్రిస్టియన్ మైనారిటీ నూతన అధ్యక్షుడిగా జంగం లారెన్స్

జయభేరి, మేడిపల్లి :



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ ఆధ్వర్యంలో నూతన సమన్వయ కమిటీల ఏర్పాటులో భాగంగా క్రిస్టియన్ మైనారిటీ నూతన అధ్యక్షుడిగా జంగం లారెన్స్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో క్రైస్తవులు బీఆర్ఎస్ కె మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ క్రైస్తవులకు చేసిందేమి లేదని, ఇక బీజేపీ తమను పట్టించుకోకుండా కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన పదేండ్లలో ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని వర్గాల ప్రజలతో కలిసి శాంతి యుతంగా జీవిస్తున్నామని చెప్పారు.ఈసారి మల్కాజ్గిరి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కి మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కౌడే పోచయ్య, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు పైళ్ల ప్రభాకర్ రెడ్డి, 4వ డివిజన్ అధ్యక్షులు యాసారం శ్రీను, 5వ డివిజన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, బిషప్ జోసఫ్ పాలంగి, పాస్టర్ రాగి భాస్కర్, పాస్టర్ బి జోనాథన్, పాస్టర్ జనార్దన్, పాస్టర్ జి యోహన్, ఎం అబ్రహం, కె జాన్సన్, ఏ. ఇస్రాయేలు, సిస్టర్ రోజు మేరీ తదితరులు పాల్గొన్నారు.



# రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకోసం ప్రత్యేక పూజలు

జయభేరి, మేడిపల్లి :

మల్కాజ్గిరి పార్లమెంట్ బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, సత్యనారాయణ, లావణ్య, ఉమ, ఎస్.లక్ష్మి, కొటశ్వరమ్మ, నవ్య, మమత,పి.లక్ష్మి,సునీత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

జయభేరి, మేడిపల్లి :




పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు. ముఖ్య అతిధులు గా టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రెష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి అధ్యక్షతన, కార్పొరేటర్ చంద్రకళ చంద్రారెడ్డి, డివిజన్ ఇంచార్జ్ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో భారీగా ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగింది. తుంగతుర్తి రవి మాట్లాడుతూ... అభివృద్ధి జరగాలి అంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని ఈరోజు భారీగా ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ లో చేరారని స్థానికంగా ఉన్న సమస్యల గురించి మాట్లాడి, పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించినట్లయితే త్వరగా పీర్జాదిగూడ లో ఉన్న (sndp, రోడ్లు, ఉప్పల్ కారిడర్) సమస్యలు అన్ని తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.






పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని 1వ డివిజన్ ఇంచార్జ్ మజర్ ఆధ్వర్యంలో చేస్తున్న ప్రచారం లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న హామీలు, పథకాల గురించి వివరించి ఓట్లను అభ్యర్థించి కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ 1వ డివిజన్ ఇంచార్జ్ ఎండి మజర్, సురేందర్ రెడ్డి, మణిరం నాయక్, మహేశ్వరప్ప, శ్రీకాంత్, సాయి, రాజు, శ్రీను, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జయభేరి, మేడిపల్లి

## పోలీసుల దాడిలో గాయపడ్డ బీజేపీ నాయకుడు

- బీజేపీ నాయకులపై పోలీసుల దౌర్జన్యం
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

జయభేరి, జూబ్లీహిల్స్:

ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలపై బోరబండ పోలీసులు దాడి చేశారని బోరబండ బీజేపీ నాయకుడు కొత్త వెంకటేశ్ ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బోరబండ డివిజన్లోని పెద్దమ్మ నగర్లో మంగళవారం బీజేపీ కార్యకర్తలు ప్రచారం నిర్వ హిస్తున్నారు. వారిలో కొంతమందిని బోరబండ పోలీసులు పోలీసులు స్టేషనక్కు తీసుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బీజేపీ బోరబండ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త వెంకటేశ్తో పాటు ముఖ్య నా యకులు పోలీస్ స్టేషన్కు వెళ్లారు. అప్పటికే పోలీస్ స్టేషన్ లో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీపీ విజయ్ కుమార్ బీజేపీ నాయకులను దుర్భాషలాడుతూ బయటకు నెట్టేయండి అని డీఏ భూపా ల్లొద్దు ఆదేశించడంతో వెంకటేశ్ కాలర్ ప ట్టుకుని బయటకు నెట్టాడు. ఈ నేపథ్యం లో వెం కటేశకు గాయాలు అయ్యాయి. చికిత్స అనంత రం ఇరువురిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉ న్నతాధికారులకు బోరబండ పోలీస్ స్టేషన్లో ఫి ర్యాదు చేశాడు. దీనిపై కిషన్రెడ్డి స్పందించి ఈసీ కి ఫిర్యాదు చెయ్యమని తెలిపినట్లు వెంకటేష్ తెలిపారు.

## హిందూ సమాజం ఐక్యం కావలసిన అవసరముంది

జయభేరి, హైదరాబాద్:

సనాతన హిందూ దర్మ పరిరక్షణ కు కట్టుబడే వ్యక్తులు, పార్టీలకు మాత్రమే ఓటు వేయాలని కమలనందా స్వామిజీ.గాయత్రి పీఠం శ్రీకాంతా నంద స్వామిజీ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ వానర సేన ఆధ్వర్యంలో సైదాబాస్ వినయ్ నగర్ లోని శ్రీ విజయ వినాయక ఆలయం హాల్ సమావేశం నిర్వహించారు. నేతలు దేవాలయ భూములు కబ్జా చేసి తమ లబ్ధి కోసం పార్టీలు మారుతూ పదవులు వెలగ పెడుతున్నారని ఆరోపించారు. హిందు సమాజం ఐక్యంగా కావాల్సిన అవసరముందని చెప్పారు.

ఓటు ప్రజాస్వామ్యంలో బ్రహ్మాస్త్రం లాంటిదని అంటూ ఓట్ చేస్తే ఏమిటి, చేయకపోతే ఏమిటని నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో దేశం విషయంలోనే కాక తమ ఇంట్లోని వారి పరిస్థితిలు తారుమారయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అంతేగాకుండా ఇటీవల కాలంలో హింధూ సనాతన ధర్మంపై దాడులు జరిపే పార్టీలు, నాయకులు ఎక్కువైనా హిందూ ఓటర్లు పట్టించుకోకుండా వదిలేస్తే రేపు మన మనుగడకు కష్టమవుతుని చెప్పారు. హిందూ సనాతన ధర్మంపై పలు కోణాల నుంచి దాడులు జరుగుతున్నాయని పేర్కొంటూ వాటిని తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఉందని సద్గురు తెలిపారు. భాగ్యనగరంలో ముఖ్యంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించాల్సిన భాద్యతను ప్రతి హైందవ బంధూ గుర్తెరిగి పరిరక్షించకపోతే రేపు తమ తమ సురక్షతను కోల్పోయిన వారవుతారని హెచ్చరించారు. దేశం కోసం ధర్మం కోసం కృషి చేస్తున్న పార్టీలకు ఓటు వేయాలని కోరారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి

జయభేరి, సికింద్రాబాద్:

బహుజనుల రాజ్యం అంటే మనం స్వయంగా పరిపాలించుకోవడమేనని అందుకు బహుజనులందరూ ఐక్యంగా ఉండాలని సికింద్రాబాద్ బిఎస్పీ పార్టీ ఎంపీ అభ్యర్థి దండేపు బస్వా నందం అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బహుజనుల పార్టీ అంటే నాలుగు వర్గాల పార్టీ అన్నారు. కాంగ్రెస్, బిజెపి, బీ ఆర్ఎస్ పార్టీ వాళ్ళు ప్రజల ధనాన్ని వృధా చేసి ఖర్చు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డబ్బులు దండుకునే వాళ్ళే ప్రజలకు ఖర్చు పెడతారని విస్మరించారు. బిఎస్పీ పార్టీ కేవలం బహుజనల పార్టీ అని ఎంపీ అభ్యర్థిగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో బహుజనుల పార్టీ రాజ్యమేలుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## కేసులు ఎదుర్కోంటాం

- క్రిశాంక్ ను పరామర్శించిన కేటీఆర్

జయభేరి, హైదరాబాద్:

బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యుదు క్రిశాంక్ ను పరామర్శించేందుకు చంచల్ టూడ జైలుకు మాజీమంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చారు.కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతిలో అధికారం ఉందని బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులు బాణాయించి జైలుకు పంపడం మంచిది కాదని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, తప్పకుండా మేము బదులు చెబుతామని, క్రీషాంక్ సోషల్ మీడియా లో పోస్టు చేసిన సర్క్యులర్ తప్పుడు అయితే నేను చంచల్ గూడా జైలు కు వెళ్ళడానికి తను సిద్ధం అని, ఒకవేళ సర్క్యులర్ నిజమని మేము రుజువు చేపిస్తే రేవంత్ రెడ్డి జైలుకు వెళ్తాడా అని కేటీఆర్ సవాల్ చేసారు. బీఆర్ఎస్ శ్రేణులకు కేసులు కొత్తేమి కాదని, ధైర్యంగా ఎదుర్కోంటామని, బీఆర్ఎస్ ఉద్యమాల పార్టీ అని ఆయన అన్నారు.



సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) వీరంగం సృష్టించింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటములతో ఒత్తిడిలో ఉన్న హైదరాబాద్.. సొంత ఇలాఖాలో తమ సత్తా ఏంటో చూపెట్టింది. లక్నో సూపర్‌జెయింట్స్‌కు చుక్కలు చూపిస్తూ ప్లేఆఫ్స్ రేసులో మరింత ముందంజ వేసింది. టాప్4లో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కింది. తొలుత లక్నోకు స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన హైదరాబాద్.. ట్రావిస్ హెడ్,అభిషేక్‌శర్మ.. వీరవిహారంతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది.ఎస్ఆర్‌హెచ్ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసు నుంచి ముంబై తప్పుకుంది.

# లక్నోపై సన్‌రైజర్స్ వీరంగం

- అజేయ అర్ధసెంచరీలతో హెడ్, అభిషేక్ వీరవిహారం
- లక్నోపై హైదరాబాద్ ఘన విజయం
- ప్లేఆఫ్స్‌లో ముందంజ

ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులకు ఫుల్ బిర్యానీ విందు అందించింది. రసవత్తరంగా సాగుతున్న కీలకమైన ప్లేఆఫ్స్ రేసులో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమదైన రీతిలో లక్నో సూపర్‌జెయింట్‌స్‌ను చిత్తుచేస్తూ గెలుపు ఢంకా మోగించింది. బుధవారం పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో లక్నోపై భారీ విజయం సాధించింది. తొలుత లక్నో.. నిర్ణీత 20 ఓవర్లలో 1654 స్కోరుకు పరిమితమైంది.
ఆయూశ్ బదోని(30 బంతుల్లో 55 నాటౌట్, 9ఫోర్లు), నికోలస్ పూరన్ (26 బంతుల్లో 48 నాటౌట్, 6ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భువనేశ్వర్(2/12) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన రైజర్స్ 9.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 167 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(30 బంతుల్లో 89 నాటౌట్. 8ఫోర్లు, 8సిక్స్‌లు), అభిషేక్‌శర్మ(28 బంతుల్లో 75 నాటౌట్, 8ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీలతో కదంతొక్కారు. లక్నో బౌలర్లు కనీసం ఒక వికెట్ తీయలేకపోయారు. సూపర్ అర్ధసెంచరీతో అదరగొట్టిన హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.
అగ్నికి ఆజ్యం తోడైనట్లు ట్రావిస్ హెడ్‌కు అభిషేక్‌శర్మ తోడవ్వడం హైదరాబాద్ భారీ విజయానికి కారణమైంది. లక్నో నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనలో ఆది నుంచే రైజర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరు కలిసి బౌండరీలు అలవోకగా బాదుతూ ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారించారు.
యశ్ ఠాకూర్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే వీరి విధ్వంసానికి తెరలేచింది. ఈ ఓవర్లో అభిషేక నాలుగు ఫోర్లతో 17 పరుగులు వచ్చి పడ్డాయి. ఇక తన వంతు అన్నట్లు హెడ్..గౌతమ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మూడు భారీ సిక్స్‌లు, ఫోర్‌తో గేర్ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. రవి బిష్ణోయ్ 4వ ఓవర్లో అభిషేక్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన నవీనుల్ హక్ ఈసారి రైజర్స్ ఓపెనర్ల బ్యాటింగ్‌కు బలయ్యాడు. ఈ క్రమంలో 16 బంతుల్లో మెరుపు అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరి దూకుడును అడ్డుకునేందుకు లక్నో కెప్టెన్ రాహుల్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది.
మరోమారు బౌలింగ్‌కు వచ్చిన యశ్ ఠాకూర్‌ను అభిషేక్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో అరుసుకోవడంతో 20 పరుగులు వచ్చి పడ్డాయి. ఇలా ప్రతీ ఓవర్‌కు 15 పరుగులకు తగ్గకుండా హైదరాబాద్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి రైజర్స్ 107 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో రెండో అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరు నమోదు చేసుకుంది. ఏడో ఓవర్‌కు వచ్చిన బదోనిని హెడ్, అభిషేక్ ఇద్దరు కలిసి దడేల్‌మనిపించారు. అభిషేక్ 19 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరి బౌండరీల జోరుతో లక్ష్యం అంతకంతకు కరిగిపోగా..యశ్ ఠాకూర్ 10వ ఓవర్ నాలుగో బంతిని అభిషేక్ సిక్స్ కొట్టి మ్యాచ్‌కు ఘనమైన ముగింపు ఇచ్చాడు. 62 బంతులు మిగిలి ఉండగానే హైదరాబాద్ రికార్డు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. టాస్ గెలిచిన లక్నో మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. తాము తప్పు చేసిన సంగతి తెలుసుకునేందుకు లక్నోకు పెద్ద సమయం పట్టలేదు. పిచ్ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఆది నుంచే సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు ఆది నుంచే లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. భువనేశ్వర్ మూడో ఓవర్ తొలి బంతికి భారీ షాట్ ఆడబోయిన క్వింటన్ డికాక్(2) నితీశ్‌రెడ్డి క్యాచ్ పట్టడంతో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు.
అతడే వేసిన ఐదో ఓవర్లో స్టొయినిస్(3) సన్విర్‌సింగ్ సూపర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. నాలుగో వికెట్‌గా వచ్చిన కృనాల్ పాండ్యా.. రాహుల్‌కు జతకలిశాడు. వీరిద్దరు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పది ఓవర్లు ముగిసే సరికి లక్నో 57 పరుగులకు 3 కీలక వికెట్లు కోల్పోయింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో కృనాల్ పాండ్యా(24) రనౌట్‌గా వెనుదిరుగడంతో లక్నో కష్టాలు మరింత రెట్టింపు అయ్యాయి. అయితే ఇక్కణ్నుంచి నికోలస్ పూరన్, ఆయూశ్ బదోనీ బ్యాటింగ్‌తో లక్నో గాడిలో పడింది. టాపార్డర్ తడబడ్డ చోట..బదోని, పూరన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది ఆఖర్లో ధాటిగా ఆడటంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

**సంక్షిప్త స్కోర్లు**

**లక్నో:** 20 ఓవర్లలో 165/4 (బదోని 55 నాటౌట్, పూరన్ 48 నాటౌట్, భువనేశ్వర్ 2/12, కమిన్స్ 1/47), **హైదరాబాద్:** 9.4 ఓవర్లలో 167/0 (హెడ్ 89 నాటౌట్, అభిషేక్ 75 నాటౌట్)

**రికార్డుల హోరు**

12 హైదరాబాద్ చేసిన 167 పరుగులలో ఓపెనర్లు తీసిన సింగిల్స్. మిగిలిన పరుగులన్నీ 4, 6 రూపంలో వచ్చినవే. హెడ్, అభిషేక్ కలిసి 16 ఫోర్లు, 14 సిక్సర్లు(ఇవే 148) బాదారు.

**ఛేదనను హైదరాబాద్**

రాత్రి 9:23 గంటలకు మొదలు పెట్టి 10:15 గంటలకు పూర్తిచేసింది. 42 నిమిషాల్లో ఛేదన పూర్తైంది. ఐపీఎల్ చరిత్రలో మొదటి 10 ఓవర్ల ఆట తర్వాత అత్యధిక స్కోరు ఇదే (167/0). గతంలో ఈ రికార్డు హైదరాబాద్ పేరిటే (ఢిల్లీపై 158) ఉంది.
62 వంద పరుగులు, అంతకంటే ఎక్కువ టార్గెట్ ఉండి ఎక్కువ బంతులు మిగిలుండగానే విజయం సాధించడం ఐపీఎల్ చరిత్రలో ఇదే ప్రథమం. లక్నోతో మ్యాచ్‌లో హైదరాబాద్ 62 బంతులుండగానే లక్ష్యాన్ని పూర్తిచేసింది.
34 ఐపీఎల్‌లో అతి తక్కువ బంతుల్లోనే వంద పరుగులు జతచేసిన జోడీలో హెడ్‌అభిషేక్ రెండో స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో మొదటి స్థానం (30 బంతులు) కూడా వాళ్లదే.
హైదరాబాద్ తరపున అత్యంత వేగవంతమైన అర్ధసెంచరీలు చేసినవారిలో తొలి నాలుగు స్థానాలు హెడ్‌అభిషేక్‌వే. హెడ్ ఈ సీజన్‌లో మూడు సార్లు ఆ ఘనత సాధించగా అభిషేక్ ఓసారి ఆ రికార్డు అందుకున్నాడు.




# ఉదయం ఆహ్లాదంగా ఉండాలంటే?

ఒకప్పుడు ఉదయం కాగానే పక్షుల కిలకిలారావాలు సుప్రభాతం పలికేవి. వేకువజామునే మలయమారుతం ముంగురులను ముద్దాడేది. కానీ, ఇప్పుడు ప్రతి ఉదయం సెల్‌ఫోన్ చూడటంతోనే మొదలవుతున్నది. ఇంట్లో ఉన్నవాళ్లను పలకరించకముందే.. స్నేహితులకు సందేశాలు పంపడం రివాజుగా మారింది. అయితే, ఉదయం లేవగానే కొంత సమయాన్ని మనకోసం కేటాయించుకోవడం వల్ల రోజంతా ప్రశాంతంగా ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.



కష్టమే అయినా తెల్లవారుజామున లేవడం మంచిది. ముఖ్యంగా వేసవిలో సూర్యోదయానికి ముందు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త పెందరాలే లేచి డాబాపైకి వెళ్లి... ఉదయిస్తున్న సూర్యుణ్ని చూడటం దినచర్యగా చేసుకోండి.
లేవగానే నేర వార్తలు, రాజకీయ వార్తలు వినడం ద్వారా నెగెటివిటీ పెరుగుతుంది. ఆ భారం రోజంతా కొనసాగుతుంది. అలా కావొద్దంటే.. శ్రావ్యమైన సంగీతం వినండి. లేదంటే మీకు నచ్చిన మ్యూజిక్ ఎంజాయ్ చేయండి. నాలుగు మంచి మాటలు వినే ప్రయత్నం చేయండి. సంగీతం ఆసక్తి లేకపోతే.. కండ్లు మూసుకొని మీకు నచ్చిన వ్యక్తిని, మీ జీవితంలో నచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకోండి. ఇది మీలో ఆనందాన్ని,నమ్మకాన్ని పెంచుతుంది.
తేలికపాటి యోగాసనాలు రోజూ చేయడం అలవాటు చేసుకోండి. దీనివల్ల మనసు ఉత్సాహంగా మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.
ఉదయం లేవగానే మీ గురించి ఆలోచించుకోవాలి. ఆ రోజు ఏం చేయాలనుకుంటున్నారు, ప్రత్యేకమైన పనులు ఉన్నట్లయితే వాటిని ఏ సమయంలోగా పూర్తిచేయాలి.. ఇలా మనసులో అనుకోండి. దానికి తగ్గట్టుగా వ్యవహరించండి.
ప్రతీ ఉదయం చిక్కటి టీ ఆస్వాదిస్తూ కుటుంబసభ్యులతో నాలుగు మంచి విషయాలు మాట్లాడండి. ఇరుగుపొరుగు, బంధువుల తప్పొప్పుల గురించి కాకుండా.. సరదా కబుర్లు చెప్పుకొనే ప్రయత్నం చేయండి.



# బోండా నుండి నేరుగా కొబ్బరినీళ్లు తాగకూడదట..




వేడి వాతావరణంలో కొబ్బరి నీళ్లు తాగితే శరీరానికి శక్తి అందుతుంది. ఇది దాహాన్ని తీర్చడమే కాదు శరీరాన్ని చల్లబరుస్తుంది. అయితే కొబ్బరి బొండం నుండి నేరుగా కొబ్బరినీటిని తాగకూడదని చెబుతున్నారు పోషకాహార నిపుణులు.
తాజా కొబ్బరి నీళ్లు తాగితే శరీరానికి ఉపశమనంగా ఉంటుంది. కొబ్బరినీరు మంచిదే కానీ, కొబ్బరి బోండం నుండి నేరుగా తాగకూడదని వైద్యుల అభిప్రాయం. ఆ కొబ్బరి బోండంలో నీళ్లను ఒక గాజు గ్లాసులో పోసి అప్పుడు వాటిలో ఎలాంటి మలినాలు లేవని నిర్ధారించుకున్నాకే తాగాలని చెబుతున్నారు. ఎందుకంటే కొన్నిసార్లు కొబ్బరి బోండం లోపల మైకోటాక్సిన్ల ఉత్పత్తి జరుగుతుంది. దీనివల్ల ఆ నీళ్లు తాగితే తీవ్రమైన అలెర్జీలు, శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
కొబ్బరినీళ్లు ఆరోగ్యానికి అంతా మేలే చేస్తాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం కలిగిస్తాయి. మీ జీర్ణక్రియకు, మూత్ర విసర్జనకు సహకరిస్తాయి. తక్షణ శక్తిని అందిస్తాయి. కొబ్బరి నీళ్లలో పొటాషియం, మాంగనీస్, క్యాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు, సైటోకైనెన్స్ వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. అలాగే శరీరానికి తక్షణ శక్తిని అందించే ఎలక్ట్రోలైట్లు కూడా ఉంటాయి. కానీ కొబ్బరి బోండాం లోపలి భాగంలో కొన్నిసార్లు ఒక రకమైన ఫంగస్ పెరిగే అవకాశం ఉంది. ఇది నీటి రుచిని కూడా మారుస్తుంది. అలాగే కొన్ని రకాల తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు కారణం అవుతుంది. కాబట్టి కొబ్బరిబోండం లోపల అంతా శుచిగా ఉందో లేదో చూడకుండా ఆ నీటిని తాగేయకూడదు.
కొబ్బరి బొండంలో అధికంగా మోల్డ్ అని పిలిచే సూక్ష్మజీవులు చేరుతూ ఉంటాయి. ఇది ఒక చిన్న జీవి. దీనిని ఫంగస్ అని కూడా పిలుచుకోవచ్చు. తడిగా ఉండే ప్రాంతాల్లో ఇవి అభివృద్ధి చెందుతాయి. తగినంత నీటి సౌకర్యం ఉన్నప్పుడు ఈ మౌల్డ్ వ్యాప్తి చెందుతూ ఉంటుంది. కొబ్బరి బోండానికి అడుగున ఈ మోల్డ్ జీవించే అవకాశం ఉంది. కాబట్టి ఆ నీటిని ఒక గాజు గ్లాసులో వేసుకొని ఎలాంటి నల్లని పదార్థాలు లేవని నిర్ధారించుకున్నాకే తాగాలి.
ఈ మోల్డ్ ఉన్న ఆహారాలు తినడం వల్ల తీవ్రమైన అలెర్జీ వస్తుంది. తుమ్ములు, ముక్కు నుండి నీరు కారడం, కళ్ళు ఎరుపుగా మారడం, కళ్ల నుండి నీరు కారడం, చర్మంపై దద్దుర్లు రావడం, ముక్కులో దురద రావడం, దగ్గు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి వీటిలో హానికరమైన టాక్సిన్లు కూడా ఉంటాయి. ఇవి పొట్ట, కాలేయం, మూత్రపిండాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తాయి. అలాగే క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. ఈ కొబ్బరి బోండాల్లోనే కాదు, తడిగా ఉండే ఇతర ఏ ఆహార పదార్థాల పైన అయినా ఈ ఫంగస్ పెరగవచ్చు. కాబట్టి ఆహారాన్ని చాలా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. త్వరగా పాడవుతాయనుకునే పదార్థాలను ఫ్రిజ్లో ఉంచుకోవడం మంచిది.




# బుజ్జమ్మ మాట ముచ్చట..

సాయిపల్లవి సినిమా అంటే అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని ప్రేక్షకులు భావిస్తారు. కథల ఎంపికలో చాలా ఆమె చాలా సెలెక్టివ్‌గా ఉంటుందని చెబుతారు. కెరీర్ ఆరంభం నుంచి ప్రతీ చిత్రంలో తనదైన మార్క్ చూపిస్తూ విలక్షణ నాయికగా గుర్తింపును తెచ్చుకుందీ తమిళ సోయగం. నేడు సాయిపల్లవి జన్మదినం. ఈ సందర్భంగా నాగచైతన్యతో కలిసి ఆమె నటిస్తున్న 'తండేల్' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో సాయిపల్లవి చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నది. గ్రామీణ నేపథ్యంలో దేశభక్తి ప్రధాన అంశాలతో దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నాగచైతన్య జాలరి రాజు పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి ఆయన భార్య బుజ్జమ్మగా కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల్లో పాకిస్తాన్ సైన్యం చేతిలో బందీ కాబడ్డ భారత జాలరులు అక్కడి నుంచి ఎలా బయట పడ్డారు? దేశభక్తిని గుండెల్లో నింపుకున్న ఆ మత్స్యకారుల బృందం చేసిన సాహసాలేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. నేడు సాయిపల్లవికి చెందిన స్పెషల్ వీడియోను కూడా చిత్ర బృందం విడుదల చేయనుంది. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: గీతా ఆర్ట్స్, సమర్పణ: అల్లు అరవింద్, రచనదర్శకత్వం: చందూ మొండేటి.





# రాజకీయాలు రౌడీయిజం ఉండవంటున్న సత్యదేవ్

'కెరీర్ ఆరంభం నుంచి కొత్త కథలతో సినిమాలు చేస్తున్నా. రాబోవు చిత్రాల్లో కూడా నా క్యారెక్టర్స్ పూర్తి వైవిధ్యంగా ఉంటాయి. ప్రతీ సినిమాకు పాత్రలపరంగా వేరియేషన్ ఉండేలా చూసుకుంటున్నా' అన్నారు సత్యదేవ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి.గోపాలకృష్ణ దర్శకుడు. కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి నిర్మించారు. ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం సత్యదేవ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'విజయవాడ నేపథ్యంలో ముగ్గురు మిత్రుల కథ ఇది. వారి స్నేహం, జీవితాల చుట్టూ నడుస్తుంది. కుటుంబాలను గొప్ప స్థాయిలో చూసుకోవాలని కలలు కన్న వారికి కొన్ని అవరోధాలు ఎదురవుతాయి. ఈ క్రమంలో వారు చేసే పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది. విజయవాడ అంటే పాలిటిక్స్ అనుకుంటారు. కానీ ఇందులో రాజకీయాలు, రౌడీయిజం వంటి అంశాలుండవు. కథలో సహజత్వం కనిపించాలని విజయవాడలో అరవై రోజుల పాటు చిత్రీకరణ చేశాం' అన్నారు. ఈ సినిమాలో తాను వించిపేటకు చెందిన భద్ర అనే యువకుడి పాత్రలో కనిపిస్తానని, ప్రతీకారంతో రగిలిపోయే వ్యక్తిగా తన పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని సత్యదేవ్ తెలిపారు. నాయగన్, ఆపద్బాంధవుడు వంటి సినిమాలు చేయాలన్నది తన డ్రీమ్ అని, భవిష్యత్తులో ఆ తరహా క్యారెక్టర్స్ కోసం ఎదురుచూస్తున్నానని ఆయన చెప్పారు.



# ముందే థియేటర్లలోకి మణిరత్నం కమల్‌హాసన్

లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'థగ్ లైఫ్'. **KH234** ప్రాజెక్టుగా ఉలగనాయగన్ కమల్‌హాసన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న థగ్ లైఫ్‌లో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ **Sigma Thug Rule** అంటూ శింబు పాత్ర ఎలా ఉండబోతుందో తెలియజేస్తూ లాంఛ్ చేసిన వీడియోలో శింబు తన మార్క్ చూపించేందుకు స్టైలిష్ ఎంట్రీ ఇస్తున్న విజువల్స్ అభిమానులను ఖుషీ చేస్తున్నాయి. కాగా ఈ చిత్రాన్ని **2025** వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయని తెలిసిందే. అయితే మూవీ లవర్స్‌కు సర్‌ప్రైజ్ ఇస్తూ ముందే ఈ సినిమాను ముందే విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. థగ్ లైఫ్ ఈ ఏడాదే థియేటర్లలో వస్తుందని ప్రెస్ మీట్‌లో ప్రకటించారు మేకర్స్. తాజా ప్రకటనతో కమల్ హాసన్ అండ్ శింబు ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మూవీ షూటింగ్ ఢిల్లీలోని సంకట్ మోచన్ హనుమాన్ మందిర్‌లో కొనసాగుతుండగా.. కమల్ హాసన్, శింబు స్టిల్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ థగ్ లైఫ్ టీంతో డిజైన్ చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఈ మూవీని కమల్ హాసన్‌ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, రెడ్ జియాంట్ మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై కమల్ హాసన్‌ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# ఇష్టం వచ్చినట్లు రాస్తారా!

బాలీవుడ్ అగ్ర కథానాయిక జాన్వీకపూర్ వివాహం గురించి ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'జాన్వీకపూర్ తిరుపతిలో పెళ్లి చేసుకోబోతున్నది. అందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా చెప్పింది' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పోస్ట్ చేశారు. దీనిపై జాన్వీకపూర్ కాస్త సీరియస్‌గానే రియాక్ట్ అయ్యింది. 'మీ ఇష్టం వచ్చినట్లు ఏదైనా రాస్తారా' అంటూ స్పందించింది. దీంతో ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. మహారాష్ట్ర రాజకీయ కుటుంబానికి చెందిన శిఖర్ పహారియాతో జాన్వీకపూర్ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉందని ప్రచారం జరుగుతున్నది. పలు ఇంటర్వ్యూల్లో శిఖర్ గురించి జాన్వీకపూర్ గొప్పగా మాట్లాడింది. ఇటీవల ఓ ఈవెంట్‌కు 'శిఖు' అనే లోగో ఉన్న నెక్లెస్‌ను ధరించి వచ్చింది. దీంతో ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నారని బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. 'దేవర' చిత్రంలో జాన్వీకపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ చిత్రం అక్టోబర్‌లో విడుదలకానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com